క్లుప్తంగా

21 వేల చెత్త బుట్టల మంజూరు



లారీ నుంచి బుట్టలను దించుతున్న దృశ్యం

మాకవరపాలెం: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం మండలానికి 21 వేల చెత్త బుట్టలను మంజూరు చేసింది. ఇవి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 31 పంచాయతీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ఈ బుట్టలను పంపిణీ చేస్తామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ నుంచి చెత్త బుట్టలు మంజూరైనట్టు తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ వీటిని పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

కొత్తకోట సీఐగా అప్పలనాయుడు



రావికమతం: కొత్తకోట సీఐగా ఎల్. అప్పలనాయుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్‌ను విశాఖ వీఆర్‌కు పంపగా, విశాఖ సిటీ నుంచి అప్పలనాయుడు ఇక్కడికి బదిలీపై వచ్చారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిష్కారానికి కృషి చేస్తానని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి పెడతానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి



విద్యార్థులతో రిక్రియేషన్ గేమ్ ఆడిస్తున్న గ్రంథలయాధికారి దమయంతి

నర్సీపట్నం: పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చునని గ్రంథలయాధికారి పి.దమయంతి విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో మాస్ రీడింగ్ చేయించారు. నీతి కథలు చదివించి ప్రాముఖ్యతను వివరించారు. టెలిస్కోప్ ఆవశ్యకత గురించి విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ వివరించారు. విద్యార్థులకు ఉపశమనం కోసం రిక్రియేషన్ గేమ్ ఆడించారు. గ్రంథాలయానికి రావటం అలవాటు చేసుకోవాలని గ్రంథలయాధికారి సూచించారు.

విద్య, వైద్య, ఆరోగ్యానికి పెద్దపీట



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీడీవో ప్రసాద్, తదితరులు

కె.కోటపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యం, ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. ఆదివారం గవరపాలెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. బలహీన వర్గాలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ రుణాలను అందించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, సర్పంచ్ తోట భవాని, ఉప సర్పంచ్ సిమ్మ అంకుల్, అధికారులు ప్రసాద్, వెంకటలక్ష్మి, వైద్యాధికారి శైలజ, హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



రాజాం సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని మండల దివ్యాంగుల సంఘం కన్వీనర్ కాశీబాబు కోరారు. ఆదివారం రాజాం మరిడిమాంబ గుడి వద్ద సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వితంతు, వృద్ధుల పింఛన్ నగదు పెంచినట్లే, దివ్యాంగులకు రూ. 5 వేలు పెంచాలని, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని, అంత్యోదయ కార్డులు అందించి నెలకు 25 కేజీల బియ్యం ఇవ్వాలని సంఘ నేతలు కోరారు. దివ్యాంగుల సంఘం నాయకులు నాగేశ్వరరావు, పైడిరాజు, శ్రీను పాల్గొన్నారు.



శంకరం.. అభివృద్ధి హారం

- కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం
- డోలీ మోతలకు చెక్
- గ్రామాల్లో సీసీరోడ్లు
- ఇంటింటికీ కుళాయిలు

- నియోజకవర్గం -మాడుగుల
- మండలం - మాడుగుల
- పంచాయతీ - శంకరం
- పంచాయతీలో జనాభా - 4,200
- ఓటర్లు 2,300
- పంచాయతీలో గ్రామాలు - 14
- డి.గొటివాడ నుంచి రాజంపేటకు రూ 9.10 కోట్లతో పక్కా రోడ్డు
- ఇదే పంచాయతీ రామచంద్రాపురం నుంచి బొడ్డరేవుకు - రూ.1.10 కోట్లు
- సీసీ రోడ్లు రూ.80 లక్షలతో 20 రోడ్లు
- గ్రావెల్‌రోడ్లు - రూ.8 లక్షలతో 6 రోడ్లు పూర్తి
- ఇంటింటికీ కుళాయిలకు రూ.2,88,52000

మాడుగుల: ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న శంకరం పంచాయతీ ప్రగతి పథంలో పయనిస్తోంది. గతంలో సరైన రహదారులు లేక కొండ గెడ్డలు దాట లేక వర్షాలు అధికమైతే జ్వరమొచ్చినా గ్రామాల్లో వైద్యం అందక నరకయాతన పడేవారు. తాగునీటికి ఇబ్బందులు పడేవారు. 108, 104 వాహనాలు వచ్చేందుకు రహదారులు లేవు. పోడు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. పోడుభూములకు పట్టాలు లేక ప్రభుత్వ పథకాలు అందేవికావు. చౌక దుకాణాల్లో సరకులు తీసుకోవాలన్నా, పింఛన్లు అందుకోవాలన్నా, కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిందే.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక తమకు రహదారి, తాగునీటి కష్టాలు తీరాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీసీరోడ్లు, ప్రధాన డ్రైనేజీలు పూర్తి కావడంతోపాటు మండల కేంద్రానికి పక్కా రోడ్లు ఏర్పాటు చేయడంతో గ్రామాల్లోకే వాహనాలు వస్తున్నాయి.



శంకరంలో మంచినీటి ట్యాంకు నిర్మాణం



శంకరం నుంచి మునిపల్లికి కొండబాటను గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి



శంకరం పంచాయతీ కొత్తవలస నుంచి రాజంపేటకు వేస్తున్న రోడ్డు



బొడ్డరేవుకు వేస్తున్న సీసీరోడ్డు

ఊటగెడ్డల నీరు తప్పదనుకున్నాం..



శంకరం పంచాయతీలో 8 గ్రామాలకు ఊటగెడ్డల నీరే జీవనాధారం. తుపానులు వచ్చినప్పుడు మంచినీటికి ఇబ్బందులు పడేవారం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పంచాయతీలో 14 గిరి గ్రామాలకుగాను ఇప్పటికే 12 ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి సురక్షిత నీరు అందిస్తున్నారు. ఇంటికే పథకాలు అందించడం మునుపెన్నడూ చూడలేదు. గ్రామాల్లోనే ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– వంతల వరహాలమ్మ, కృష్ణంపాలెం, శంకరం పంచాయతీ

పోడుభూములుకు పట్టాలు వస్తాయనుకోలేదు.



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక, మేము సాగు చేసుకున్న పోడు భూములుకు పట్టాలు ఇచ్చారు. రైతు భరోసా నగదు వస్తోంది. సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నారు. భూమిపై హక్కు వచ్చింది. మా గ్రామాలకు రహదారులు వేశారు. మా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు రుణపడి ఉంటాం.

– రాజులమ్మ, వెలగలపాడు, శంకరం పంచాయతీ

ఇంత వరకు పట్టించుకునేవారు లేరు



మా పంచాయతీ నుంచి మండల కేంద్రానికి వెళ్లడానికి రహదారులు ఉండేవికావు. ప్రభుత్వ పథకం అందుకోవాలంటే కొండవాగులు దాటాల్సి వచ్చేది. మా పంచాయతీ శివారు గ్రామం రాజంపేట కొండపై ఉంది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా అక్కడా రహదారి నిర్మించారు. గ్రామాల్లో సీసీరోడ్లు, పక్కారోడ్లు చూడచక్కగా నిర్మిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– కొంలం రమేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకరం

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గణేష్



సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన బాధితులతో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నియోజకవర్గంలోని ఆరుగురికి సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం నాతవరం మండలం శృంగవరానికి చెందిన ఉలబాల షణ్ముఖసాయి శిరీషకు రూ.26 వేలు, చెర్లోపాలేనికి చెందిన మాకిరెడ్డి సురేష్‌కు రూ.16 వేలు, మాకవరపాలెం మండలం గంగవరానికి చెందిన పారుపల్లి అప్పలనాయుడుకు రూ.30 వేలు, రాచపల్లికి చెందిన మేడపురెడ్డి సత్యకు రూ.17 వేలు, నర్సీపట్నం మున్సిపాలిటీ, పెదబొడ్డేపల్లికి చెందిన రొంగల వేణుమాధవ్‌కు రూ.32 వేలు, గుమ్మాల రామకృష్ణ వరాహమూర్తికి రూ.32 వేలు, మొత్తం రూ.1.53 లక్షలు బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకులు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ



ఉద్యోగ విరమణ చేసిన దేముడును సన్మానిస్తున్న దృశ్యం

కె.కోటపాడు: ఉద్యోగ ధర్మాన్ని అంకిత భావంతో పని చేసే వారికి ప్రజల్లోను, ఉన్నతాధికారుల్లోను గుర్తింపు లభిస్తుందని అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ తెలిపారు. చోడవరం సబ్ డివిజన్ పోస్టల్ డిపార్టుమెంట్‌లో మైలు ఓవర్‌సీర్‌గా ఉద్యోగ విరమణ చేసిన తానారి దేముడుకు చౌడువాడలో ఆదివారం సన్మానం చేశారు. పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన దేముడు సేవలను పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎన్నటికి గుర్తుంచుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు సంజయ్ పాండా, డేన్‌వుడ్ రిసార్ట్ యజమాని దొగ్గ అచ్చింనాయుడు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా గ్రామస్థాయి నాయకులు పూర్తిస్థాయిలో పనిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మండలంలోని అంబేరుపురంలో గోవాడ, అంబేరుపురం, వెంకన్నపాలెం గ్రామాలకు చెందిన కార్యకర్తల పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నాయకులంతా కలిసిమెలసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎటువంటి మనస్పర్థలకు తావులేకుండా రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో అంకితభావంతో పనిచేసే కార్యకర్తలను కమిటీల్లో నియమించాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేవన్నారు. అభ్యర్థి ఎవరైనా వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా పనిచేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మండల ఎంపీటీసీ ఫోరం మాజీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగదుర్గ గోవింద, సర్పంచ్‌లు కార్లె ఈశ్వరమ్మ, మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీలు శరగడం నాగేశ్వరరావు, కోటి భూలోక, గోవాడ సుగర్స్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు భాస్కరరావు, పాము అప్పలనాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దేరు కుడి కాలువను అభివృద్ధి చేస్తాం

బుచ్చెయ్యపేట: వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే సుజల స్రవంతి ఏర్పాటుతో పాటు పెద్దేరు కుడి కాలువను అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి వి.వి.ఎస్.ఎన్ రాజు తెలిపారు. ఆదివారం గున్నెంపూడిలో రైతు గర్జన సదస్సులో వీరు పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకులు కోన తాతారావు, శంకర్రావు, దొండా సాయి, నాయుడు, రమేష్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా మార్ట్ ప్రారంభం



మాకవరపాలెంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్

మాకవరపాలెం: వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను సోమవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ప్రారంభిస్తారని వెలుగు ఏపీఎం చినబాబు ఆదివారం తెలిపారు. రూ.35 లక్షల డ్వాక్రా మహిళల షేర్ ధనంతో ఈ మార్ట్‌ను మాకవరపాలెంలో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మార్ట్‌లో విక్రయించేందుకు అవసరమైన సరుకులు, సామగ్రిని సిద్ధం చేశారు.

పెదమల్లునాయుడు మృతికి సంతాపం

చీడికాడ: అప్పలరాజుపురం సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చుక్కా అప్పలనాయుడు తండ్రి పెదమల్లునాయుడు(93) మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆదివారం ఇక్కడ పెదమల్లునాయుడు మృతదేహం వద్ద పూలమాల ఉంచి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఘన నివాళులర్పించారు. అప్పలనాయుడు కుటుంబ సభ్యులను ఓదార్చారు. బూడి వెంట ఎంపీపీ కురచా జయమ్మ, మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, సీనియర్ నాయకులు నారాయణమూర్తి, సుంకర శ్రీను, పీటీబాబు ఉన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర



చినపాచిలలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

రావికమతం: మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆదివారంతో ముగిసింది. ఎంపీడీవో వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఆదివారం చినపాచిలలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో పల్లెల అభివృద్ధితో దేశం అగ్రగామిగా నిలుస్తోందన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్ర

గొలుగొండ: ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు అధిక లాభాలతోపాటు ఆరోగ్యకరమైన పంటలు పండివచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర, వాన ప్రసాదరావు తెలిపారు. మండలంలో గింజర్తి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. చీడపీడలు సోకవని తెలిపారు. ప్రతీ గ్రామంలో వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి రైతు తప్పకుండా సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పెట్ల నారాయణమూర్తి, రాజశేఖర్, మల్లేస్ పాల్గొన్నారు.

గ్రూపు-2 స్టడీ మెటీరియల్ వితరణ



యువతకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: గ్రూపు-2 పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. తారువలోని ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం వీటిని అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ప్రణాళిక బద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని వారికి సూచించారు. ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆయనతోపాటు పెదగోగాడ సర్పంచ్ పైల వెంకటరమణ వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, పంచాయతీ కార్యదర్శి పి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

మురి'పింఛన్'

- రూ.3 వేల పింఛన్‌తో లబ్ధిదారుల ఆనందం
- అర్హతే ప్రామాణికంగా మంజూరు



లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్



ఇంటికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

నర్సీపట్నం: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా అవ్వాతాతలకు రూ.3 వేలు పింఛన్ అందిస్తూ వారికి నేనున్నా అంటూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారు. ఎక్కడికి తిరగాల్సిన పనిలేదు. ఎవరి సిఫార్సులు అవసరం లేదు. అర్హతే కొలమానం.. వలంటీరు స్వయంగా ఇంటికొచ్చి వివరాలు తీసుకుని సచివాలయంలో దరఖాస్తు చేయిస్తున్నారు. ఆరు మాసాలు తిరగకముందే పింఛన్ సొమ్ము ఇంటికి వచ్చి చేతికందిస్తున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీలో సీఎం పలు సంస్కరణలు తీసుకువచ్చి పారదర్శకంగా కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు.

మంది లబ్ధిదారులు..

నియోజకవర్గంలోని నర్సీపట్నం మున్సిపాలిటీ, మండలం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లో 42,826 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు 519 మంది ఉన్నారు. వీరందరికీ రూ.12.83 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. నవరత్నాలు అమలు చేస్తూ సీఎం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రూ.2 వేల పింఛన్‌ను రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతామని చెప్పిన విధంగా నూతన సంవత్సరంలో అందజేస్తూ సీఎం మాట నిలుపుకున్నారు. ప్రస్తుతం పింఛన్ల పంపిణీ పండగలా సాగుతోంది.

దరఖాస్తు చేసిన నెల రోజుల్లో పింఛన్..



మా బాబు శ్రావణ్ మూగవాడు. వలంటీర్ మా ఇంటికొచ్చి బాబు వివరాలు తీసుకుని పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసిన నెల రోజుల్లో పింఛన్ మంజూరైంది. మా బాబుకు పింఛన్ రావటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మా కుటుంబానికి ఊరటనిచ్చింది.

యర్రంశెట్టి ధనలక్ష్మి, చెట్టుపల్లి, నర్సీపట్నం

జగన్ వచ్చాకే పింఛన్..



జగన్ వచ్చాకే పింఛన్ మంజూరైంది. గత టీడీపీ పాలనలో అనేక సార్లు దరఖాస్తు చేసినా పింఛన్ రాలేదు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పింఛన్ అందుకుంటున్నాను. రూ.3 వేలకు పెంచడంతో నాకు కొండంత భరోసా కలిగింది.

ఎ.రాంబాబు, గురంధరపాలెం, నర్సీపట్నం

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



మాడుగుల: సత్యవరంలో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు



రోలుగుంట: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



ప్రవచనలు చేస్తున్న స్వామీజీలు, పీఠాధిపతులు

మాడుగుల/రోలుగుంట: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాడుగుల, రోలుగంట మండలాల్లో ఆదివారం అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ సంఘ సేవకుడు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉంటుందన్నారు. ఆ రోజు ప్రతి ఒక్కరూ దీపారాధన చేయాలని కోరారు.

దేవరాపల్లి: కొత్తపెంటలో సద్గురు దేవానంద సరస్వతీ మహారాజ్ (రుషీకేష్) 24వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.